ప్రజాశక్తి

బుధవారం 11 జూన్ 2025

విచారణకు హాజరైన పైలెట్

ప్రజాశక్తి-అనంతపురం

వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి హెలికాప్టర్ ఘటనకు సంబంధించి విచారణకు పైలెట్ మంగళవారం నాడు హాజరయ్యారు. చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్లో ఆయన్ను రామగిరి సిఐ శ్రీధర్ విచారించారు. జగన్మోహన్ రెడ్డి పర్యటనలో తిరుగు ప్రయాణంలో ఆయనను తీసుకెళ్లకుండా ఎందుకు వెళ్లారు అన్న అంశంపైన ఆయన్ను విచారించారు. అడిగిన ప్రశ్నలకు అనిల్ కుమార్ సంతృప్తికరమైన సమాధానాలు ఇచ్చినట్టు సిఐ శ్రీధర్ తెలిపారు. విఐపిని తీసుకెళ్లకుండా హెలికాప్టర్‌ను ఎలా తీసుకెళ్లారని పోలీసులు విచారించినట్లు సమాచారం. జన సందోహం ఎక్కువగా ఉండటం వెనుక భాగంలో ఫ్లెక్సీస్ షీల్డ్ దెబ్బతిని ఉండడంతో విఐపిని తీసుకెళ్లలేకపోయినట్టు పైలెట్ సమాధానం ఇచ్చినట్టు తెలుస్తుంది. మీరు ఎలా వెళ్లారు అని పోలీసులు అడుగగా తాము ముందు భాగంలో సురక్షిత ప్రాంతంలో ఉండడంతో హెలికాప్టర్‌ను తీసుకెళ్లామని పైలెట్ సమాధానం చెప్పినట్లు తెలుస్తుంది. పైలెట్ ఇచ్చిన సమాధానానికి నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణ అనంతరం శ్రీధర్ తెలిపారు.

మహిళలపై పెరుగుతున్న హింస

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్‌బిఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మల

- నియంత్రణ లేని మద్యం, సోషల్‌మీడియాతో ప్రమాదం
- ప్రభుత్వం స్పందించి నియంత్రణ చర్యలు చేపట్టాలి
- విద్యార్థిని తన్మయి నిందితులను కఠినంగా శిక్షించాలి
- ఐద్వా రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల మహిళలు, యువతులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు, హింసాత్మక ఘటనలు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నాయని పలువురు వక్తలు తెలియజేశారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వాలు విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్ విద్యార్థినిని తన్మయిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తన్మయి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక ఎన్జీవో హోంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌బిఎన్ విద్యాసంస్థల కార్యదర్శి నిర్మల ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలపై హింస విపరీతంగా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో వచ్చిన మార్పు హింస పెరుగుదలకు కారణం అవుతోందన్నారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం సోషియల్ మీడియా ప్రభావం యువతపై తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ ప్రభావం మంచి కంటే చెడు వైపు ఎక్కువగా నడిపిస్తూ ఉండడం ఆందోళన కలిగిస్తున్న అంశం అన్నారు. ఆర్ట్స్ కళాశాల అధ్యాపకురాలు బందా మాట్లాడుతూ దేశంలో ప్రతి మూడు నిమిషాలకు మహిళనూ ఒక హింస చోటు చేసుకుంటుందని నివేదికలు చెబుతున్నాయన్నారు. ఈ హింసల్లో తల్లిదండ్రులు పాత్ర కూడా ఉండటం ఆందోళన కలిగిస్తున్న అంశం అన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలంటే యువతలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య సమాన గౌరవం ఇచ్చిపుచ్చుకునే విధంగా తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా నాయకులు వీరు యాదవ్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండటం పిల్లలపై కొంతవరకు నియంత్రణ ఉండేదని చెప్పారు. ఇప్పుడు పిల్లలపై పెద్దల నియంత్రణ కొరబడిందని తెలిపారు. దీంతో వారు చెడు మార్గం వైపు పయనించేందుకు అవకాశం ఏర్పడుతోందన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. యుటిఎఫ్ నాయకులు సరళ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ లు అందుబాటులోకి వచ్చాక పిల్లల ఆలోచన విధానాల్లో మార్పులు వచ్చాయన్నారు. వాటి వాడకాన్ని నియంత్రించే విధంగా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. జెవివి నాయకులు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలు కూడా మహిళలపై హింస పెరగడానికి కారణమని పేర్కొన్నారు. వీటి నియంత్రణకు గట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు శ్యామల, నగర నాయకులు చంద్రిక, అశ్విని పాల్గొన్నారు.

స్టీల్ పరిశ్రమలో వలస కార్మికుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలో ఉన్న మీనాక్షి స్టీల్ పరిశ్రమలో వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాల మేరకు పరిశ్రమలో రోలింగ్ మిల్ విభాగంలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రం జమాయి జిల్లా కర్మ గ్రామానికి చెందిన వలస కార్మికుడు జుబ్లాల్ విధులు నిర్వహిస్తూ ఉండగా టిఎంటి బార్ తంబి అతని కడుపులోకి చొచ్చుకు పోయింది. పరిశ్రమ యాజమాన్యం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావాల్సి ఉండగా పట్టణంలోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కు తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించిన ఆ వైద్యుడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆ కార్మికుడు మృతి చెందినట్లు పరీక్షలు నిర్వహించిన వైద్యులు తెలిపారు. అయితే యాజమాన్యం ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ఉంటే ఆ కార్మికుడు బ్రతికే అవకాశం ఉండేది. ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళితే విషయం బయటకు వస్తోందని గుట్టు చప్పుడు కాకుండా ప్రవేటు అసుపత్రులకు తీసుకెళ్లి వైద్య అందిస్తున్నట్లు విమర్శలున్నాయి. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, ప్రమాదాలు జరిగిన వెంటనే యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రయివేటు ఆసుపత్రులకు కార్మికులను తీసుకువెళ్లడంతోనే ప్రమాదాలు మరింత ఎక్కువ అవుతున్నాయని తూముకుంట కార్మిక సంఘం నాయకులు రవికుమార్ ఆరోపిస్తున్నారు. పరిశ్రమల ఇన్స్ పెక్టర్ తరచూ పరిశ్రమలను తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు పాటించని పరిశ్రమల పైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ వారు పట్టించుకోవటం లేదన్న విమర్శలున్నాయి. వెంటనే మీనాక్షి స్టీల్ పరిశ్రమ పైన శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు మృతి చెందిన కుటుంబానికి యాజమాన్యం చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని రవికుమార్ డిమాండ్ చేశారు.

'పురం'మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జున

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా మల్లికార్జునను నియమిస్తు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం పొద్దుటూరు కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్నారు. 2018-2019 మధ్య కాలంలో 10 నెలల పాటు ఇక్కడ కమిషనర్ గా విధులు నిర్వహించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కమిషనర్ సంగం శ్రీనివాసులుకు అర్హత లేకున్న అందలం ఎక్కించారని ఒక వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. దీంతో మరో మూడు నెలల పాటు ఇతన్ని డిప్యూటేషన్ పొడగించాల్సి ఉన్నప్పటికి పొడగించకుండా సొంత శాఖకు పంపించారు. త్వరలో మల్లికార్జున భాధ్యతలను స్వీకరించనున్నారు.

బిజెపికి కొమ్ముకాస్తున్న కూటమి

- విజయమ్మను దూరం పెట్టిన రోజునే జగన్ పతనం ఆరంభం
- కావాలనే తనపై వైసిపి తప్పడు ఆరోపణలు
- ఎపి పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మతోన్మాద విధానాలతో పాలన సాగిస్తున్న బిజెపికి రాష్ట్రంలో వామపక్షాలు, కాంగ్రెస్ మినహా కూటమి, ప్రతిపక్ష పార్టీలన్నీ కొమ్ముకాస్తున్నాయని ఎపి పిసిసి అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. జిల్లాల పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆమె పుట్టపర్తికి విచ్చేశారు. సాయి ఆరామంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనయతుల్లా అధ్యక్షతన విస్తతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం షర్మిల విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలన్నా, విభజన హామీలు నెరవేరాలన్నా, విశాఖపట్నం ఉక్కు పరిశ్రమ నిలబడాలన్న కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు. అధికార కూటమి ప్రభుత్వం, ప్రతిపక్ష వైసిపి బీజేపీతో అంటకాగుతూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. అధికారంలోకి రాకముందు జగన్ కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానని ప్రగల్భాలు పలికి, అధికారంలోకి రాగానే మోడీకి దాసోహం అయ్యారన్నారు. అధికారంలో ఉండగా తల్లి, చెల్లిని మరచిన వ్యక్తి జగన్ అన్నారు. విజయమ్మను దూరం పెట్టిన నాటి నుంచే జగన్ పతనం ప్రారంభం అయ్యిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, చంద్రబాబుకు తాను మద్దతు ఇస్తున్నానని వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. బిజెపికి కొమ్ము కాసే ఏ పార్టీకీ కాంగ్రెస్ మద్దతు ఇవ్వదన్నారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్ కోసం మండుటెండలో 3500 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చే విధంగా తాను సేవలు అందిస్తే అవన్నీ జగన్ మర్చిపోయాడన్నారు. వైసిపి నేతలు చేస్తున్న అతస్య ఆరోపణలకు భయపడేది లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యచరణ ప్రణాళికలు అమలు చేసి ముందుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షుడు కోటా సత్యం, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి, ఎఐసిసి సభ్యుడు గణేష్ యాదవ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కెటి.శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఆఫ్కాస్ రద్దు చేస్తే కార్మికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. అలాగే ఒప్పంద కార్మికులను పర్మనెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇస్తూ పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ఇప్పటికే సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని ప్రభుత్వం తమ డిమాండ్లను 15 రోజులలో పరిష్కరించాలని అలా చేయని పక్షంలో సమ్మెలోకి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు రమణ, రమేష్, గణేష్, రామదాసు,కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో కార్మికుల నిరసన

ధర్మవరంలో సమ్మెనోటీసు అందజేస్తున్న కార్మికులు, నాయకులు

ధర్మవరం రూరల్ : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ధర్మవరంలో మంగళవారం ఉదయం మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలియజేసి కమిషనర్ ప్రమోద్ కుమార్‌కి సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భ:గా సిఐటియు నాయకులు జె వి రమణ, హైదర్ వలి, ఇంజనీరింగ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొగ్గ నాగరాజు, పారిశుద్ధ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు ఎం బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ,స్కిల్, సెమిస్కిల్డ్ కార్మికులకు వేతనాలు జీవో ప్రకారం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించనందున రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించబోతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు బాబు, అనిల్, యోగి, కాటమయ్య ,దస్తగిరి, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు ఓబులేసు, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలతో భాషా పండితుల బేజారు..!

- రెండేళ్లకోసారి బలవంతపు బదిలీలు
- ఉద్యోగోన్నతుల్లోనూ అన్యాయం

ప్రజాశక్తి: బ్రహ్మసముద్రం

బదిలీల ప్రక్రియ భాషా ఉపాధ్యాయులను ఇబ్బందికి గురి చేస్తోంది. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో అనేక ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు మంగళం పాడుతున్న పరిస్థితులు కన్పిస్తున్నాయి. విద్యార్థులు లేరన్న సాకుతో తెలుగు పాఠశాలలకు తెలుగు ఉపాధ్యాయుడి పోస్టును కేటాయించడం లేదు. ఇక భాషా పండితులకు ఎనిమిది సంవత్సరాల వరకు బదిలీలు ఉండరాదనే నిబంధన ఉన్నా బలవంతంగా బదిలీలు చేస్తూ ప్రతి సారీ వారిని పాఠశాలలు మారుస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా డీఈఓ పుల్‌లో 1300 మంది భాషా పండితులు ఉన్నారు. అనంతపురం జిల్లాలో 104 మంది ఉన్నారు. బ్రహ్మసముద్రం మండల వ్యాప్తంగా 36 భాషా పండితులు ఉండాలి. ప్రస్తుతం 32 మంది భాష ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో తెలుగు భాషా పండితులు 16, హిందీ భాషా పండితులు 7, ఆంగ్ల భాష ఉపాధ్యాయులు 9 మంది ఉన్నారు. ఇలా అన్ని మండలాల్లోనూ భాషా పండితులు విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు భాషా పండిత ఉపాధ్యాయుడు కనీసం 8 సంవత్సరాలు ఒక పాఠశాలలో పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. ఎనిమిది సంవత్సరాలు దాటిన తర్వాత తప్పనిసరిగా బదిలీ పొందాలి. డిఇఒ పూల్ భాషా పండితులు బదిలీలు జరిగిన ప్రతిసారి వారికి ఇష్టం లేకున్నా బలవంతపు బదిలీకి గురవుతున్నారు. గత ఆరు సంవత్సరాల్లో నాలుగు సార్లు భాషా పండితులు బదిలీలు అయ్యారు. ఈ బదిలీలతోపాటు అదనంగా విద్యా సంవత్సరం మధ్యలో కొన్ని పాఠశాలల్లో బోధన సిబ్బంది కొరత ఉండడంతో వేరే పాఠశాలలకు పని కేటాయింపు పేరుతో బదిలీ చేస్తున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో అదనపు బదిలీలు కూడా ఇస్తుండడంతో భాషా పండితులు అన్ని విధాలా ఇబ్బంది పడుతున్నారు.

హైకోర్టు తీర్పునిచ్చినా..!

బాషా పండితుల ఉద్యోగోన్నతులకు సంబంధించి హైకోర్టులో కేసు వేయగా 2024 డిసెంబర్ 20న జస్టిస్ మన్మధ రావు సింగిల్ బెంచ్ ధర్మాసనం భాషా పండితులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 2019 నుంచి భాషా పండితులకు ఇవ్వాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించి మూడు నెలల గడువులోపు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసింది. ఈ లోగా తీర్పును సవాల్ చేస్తూ కొందరు కోర్టులో కేసు వేయడంతో హైకోర్టు భాషా ఉపాధ్యాయులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పు పైన స్టేటస్ కో ఇచ్చింది. దీంతో అర్హత ఉన్నా ఉద్యోగోన్నతులు లేక భాష ఉపాధ్యాయులు నష్టపోయారు.

ఉద్యోగోన్నతులకు ఎసరు..!

2019 నవంబర్ నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయుల(తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, తమిళం, కన్నడ, ఒరియా) ఉన్నతీకరణ జరిగింది. 2017లో ఇచ్చిన జీవో ఎంఎస్ 91ని పక్కనపెట్టి జీవో ఎంఎస్ 77ని అప్పటి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నిబంధనతో అర్హులైన భాషా పండితులు ఉద్యోగోన్నతి అవకాశాన్ని కోల్పోయారు. భాషా పండితులకు ఉన్న ఎల్‌పి క్యాడర్ లేకుండా పోయింది. ఎల్‌పి వ్యవస్థ లేక ఇటు ప్రమోషన్ రాక భాషా పండితులు ఏ ఉపాధ్యాయులో వారికే అర్థం కాని పరిస్థితి నెలకొంది. తక్కిన భాషా పండితులందరినీ డిఇఒ పూల్ భాషా పండితులుగా పరిగణించి వర్క్ అగైనెస్ట్ జీతాలతో విధులు కేటాయిస్తున్నారు.

ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

2023లో కుందుర్పి మండలం శ్రీమజ్జనపల్లి నుంచి బదిలీ పై కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లి ఎంపియుపిఎస్ పాఠశాలకు వచ్చాను. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయుడి పోస్ట్ లేకపోవడంతో ఇప్పుడు జరిగే బదిలీల్లో మళ్లీ నేను వేరొక పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. 2017 నుంచి ఇప్పటికే 5 స్కూళ్లు మారాను. నేను 89 శాతం వైకల్యంతో కలిగి, ప్రిఫరెన్షియల్ కేటగిరిలో ఉన్న నన్ను 8 ఏళ్ళు ఒకచోట పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రతీ సంవత్సరం డీఈఓ పూల్ పేరుతో ప్రతీ ఏటా బదిలీ చేస్తూనే ఉన్నారు. జిల్లాలో 88 మంది తెలుగు పండితులు నాలాగే ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఉద్యోగోన్నతులు ఇచ్చి, శాశ్వత స్థానాల్లో నియమించేలా చర్యలు తీసుకోవాలి.

ఆది ఆంధ్ర తిప్పేస్వామి,
తెలుగు భాష ఉపాధ్యాయులు.

తెలుగు ఉపాధ్యాయులను నియమించాలి

తెలుగు భాష అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతి పాఠశాలలోనూ తెలుగు ఉపాధ్యాయులను నియమించాలి. రేషనలైజేషన్ పేరుతో అనేక ప్రాథమికోన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు మంగళం పాడుతున్న విధానం సరికాదు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు వైభవానికి కషి చేయాలి.

చిన్న వన్నప్ప,
తెలుగు పాఠశాల సహాయకులు పిల్లలపల్లి.

తెలుగు పోస్టులు తగ్గించడం సరికాదు

ప్రస్తుతం జరుగుతున్న పాఠశాల ఉపాధ్యాయ బదిలీల్లో భాషా పండితులకు అన్యాయం జరుగుతోంది. పునర్ విభజన చేసిన, యూపీ పాఠశాలల్లో తెలుగు పోస్టులను తగ్గించడం సరికాదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లీష్ మీడియం మాత్రమే అంటూ ప్రభుత్వాలు చెబుతుండడం సరికాదు. ప్రభుత్వం ప్రతి పాఠశాలకు తెలుగుభాష ఉపాధ్యాయులను నియమించాలి. భాషా పండితులకు ఉద్యోగోన్నతులనూ కల్పించాలి.

గనేపాటి అశోక్ కుమార్.
ఉపాధ్యాయుడు, పిల్లలపల్లి.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్ర

నిధులు తగ్గించడం మోసం చేయడమే - వ్యకాసం మహిళా రాష్ట్ర కన్వీనర్ నాగరాణి

ప్రజాశక్తి-సోమందేపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా నిధులు తగ్గించి కూలీలకు ద్రోహం చేసే కుట్ర చేస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం మహిళా రాష్ట్ర కన్వీనర్ నాగరాణి విమర్శించారు. మంగళవారం నాడు మండలం పరిధిలోని గుడిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. సమ్మర్ అలవెన్స్, నీళ్ల, ఛార్జీలు, పనికి తగ్గ వేతనం, వేతనం పెండింగ్ తదితర సమస్యలను కూలీలు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నాగరాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని గ్రామీణ కూలీలకు దూరం చేసే కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు వారి వేతనం రూ.307కు పెంచినప్పటికి అందుకు తగ్గ నిధులు బడ్జెట్లో కేటాయించకపోవడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా ఉపాధి కూలీలకు ఎలా లబ్ధి చేకూరుస్తారన్నారు. కూలీలకు పని ప్రదేశాల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలూ కల్పించలేదన్నారు. పథకం అమలులో రాష్ట్రాల పెత్తనాలను కేంద్రం హరిస్తోందన్నారు. వేతన బకాయిల నిధులు వచ్చి 5 రోజులు అవుతున్నా కూలీల ఖాతాల్లో జమ చేయలేదన్నారు. కేంద్ర ఉపాధికి నిధుల కోత పెడుతున్నా రాష్ట్రంలోని

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

కూటమి నేతలు ప్రశ్నించే పరిస్థితుల్లో లేకపోవడం సిగ్గుచేటన్నారు. కూలీలు అందరూ ఐక్యంగా ఉండి ఉపాధి హామీని పరిరక్షించుకునేలా పోరాటం సాగించాలన్నారు. కార్మికులు, కూలీల హక్కుల పరిరక్షణ కోసం జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో ఉపాధి కూలీలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ ఉపాధి కూలీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. రెండు రోజుల క్రితం తలుపుల మండలం బత్రేపల్లి గ్రామంలో ఉపాధి పనులు చేస్తూ మరణించిన కూలీ కదిరయ్య కుటుంబానికి తక్షణ బీమా రూ.4లక్షలు చెల్లించి, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. రోజు కూలీ రూ.307 వచ్చేలా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేష్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం



సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే పల్లె సింధూర, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వ్యవసాయాన్ని లాభసాటిగా తయారుచేసి, రైతులను అన్ని విధాల ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పుట్టపర్తి మండలంలోని పెడపల్లి గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరతో కలిసి మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తన వేరుశనగ కాయలను సబ్సిడీతో రైతులకు అందిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జూన్ 21 నుంచి అన్నదాత సుఖీభవ ద్వారా రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత కింద రూ,7వేలు, కేంద్రం ఇచ్చే 2వేల రూపాయలతో కలిపి మొత్తం రూ .9వేలు జమ చేస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని రైతు సంక్షేమ ప్రభుత్వంగా అభివర్ణించారు. జిఅనంతరం రైతులకు విత్తన వేరుశనక్కాయల బస్తాలను మంత్రి సవితతో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు సుబ్బరాయుడు, ఆర్డీవో సువర్ణ, టిడిపి సీనియర్ నాయకులు సామకోటి ఆదినారాయణ, పుట్టపర్తి మండల కన్వీనర్ విజయ్ కుమార్, మాజీ జెడ్పిటిసి శ్రీరాం నాయక్ మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ బొమ్మయ్య, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కదిరి రూరల్ మండలం మార్కెట్ యార్డ్‌లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్న విత్తన కాయలు పంపిణీ చేయలేదని వైసిపి అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై బురదల్లే కార్యక్రమానికి తెరలేపారని అన్నారు. గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వం రైతులను ఆదుకున్న పాపాన పోలేదని విమర్శించారుఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి సత్యనారాయణ, ఎంపీడీవో పోలప్ప, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ :మండల పరిధిలోని బుల్లసముద్రం సచివాలయంలో సబ్సిడీ విత్తన వేరుశనగను మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మంగళవారం పంపిణీ చేశారు. రైతుల కోసం ప్రభుత్వం వ్యవసాయ యంత్రాలు డ్రోన్ ట్రాక్టర్ వంటివాటిని సబ్సిడీతో అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, నాయకులు పాండురంగప్ప, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, జయపాల్, నాగరాజు, పద్మనాభ గౌడ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే భూ సేకరణ పరిహారంలో మోసం

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని మలగూరు-పాలసముద్రం మీదుగా ఏర్పాటు చేస్తున్న రైల్వే బ్రాడ్ లైన్ కోసం భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పంపిణీలో తీవ్ర అన్యాయం జరుగుతోందని నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక తహశీల్దార్ మారుతిని కలసి తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. ఈ సందర్భంగా రైతులు రామాంజనేయులు, సి శ్రీరాములు, కే అశ్వర్ధ రెడ్డి, ఎస్ నాగభూషణ, అశ్వర్థప్ప మాట్లాడుతూ 2023లో రైల్వే బ్రాడ్‌లైన్ కోసం తమ భూములను ప్రభుత్వం తీసుకుందన్నారు. అప్పట్లో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సంబంధిత అధికారులు గ్రామంలో గ్రామ సభ గాని, నోటీసులు గానీ, ముందస్తు సమాచారం గానీ రైతులకు తెలియజేయకుండా ఏకపక్షంగా భూసేకరణ చేపట్టారని విమర్శించారు. ప్రభుత్వం ఎకరాకు 14 లక్షల రూపాయలుగా పరిహారం ప్రకటించడంతో దీనిపై తాము హైకోర్టు ఆశ్రయించామన్నారు. దీంతో కోర్టు రైతులు అంగీకారంతో 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయితే తాము కోర్టును ఆశ్రయించామన్న కారణంతో అధికారులు తమపై కక్ష పెంచుకుని అన్యాయం చేశారన్నారు. కేవలం తమకు రూ.8.70 లక్షలతో మాత్రమే పరిహారాన్ని లెక్క కట్టారని మిగతా రైతులకు 14 లక్షల రూపాయలతో పరిహారం అందించారని విమర్శించారు. దీంతో తాము పరిహారాన్ని తీసుకోలేదన్నారు. ఇదే బ్రాడ్‌లైన్ కోసం భూములు ఇచ్చిన మలగూరు పంచాయతీ లో భూముల రిజిస్టర్ వ్యాల్యూ రూ.2.50 లక్షలు ఉండగా ఆ రైతులకు 28 లక్షలు పరిహారం, చలివెందుల పంచాయతీ రూ. 2.40 లక్షలు రిజిస్టర్ వాల్యూ ఉండగా వారికి కూడా 28 లక్షల రూపాయలు, నాన్ అగ్రికల్చర్ భూములకు రిజిస్టర్ వేల్యూ రూ. 16 లక్షలు ఉండగా 48 లక్షల రూపాయలు ఇచ్చారన్నారు. విలదల పంచాయతీలో భూముల రిజిస్టర్ వాల్యూ రూ.3.40 లక్షలు ఉండగా పద్నాలుగు లక్షల రూపాయలతోనే పరిహారం అందించారన్నారు. తాము ఐదుగురు రైతులు కోర్టుకు వెళ్లడంతో కేవలం రూ.8.70 లక్షలతో పరిహారం ఇచ్చారన్నారు. చింత, వేప, జామ చెట్లు అనేకంగా ఉండగా వాటికి సరైన పరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. రామాంజనేయులు అనే రైతుకు 140 జామ చెట్లు ఉండగా కేవలం 20 చెట్లకు మాత్రమే పరిహారం అందించారన్నారు. సంబంధిత ఉద్యాన శాఖ అధికారులకు పలుమార్లు తెలియజేసిన ఎన్ని చెట్లు ఉన్నా కేవలం ఎకరాకు ఎన్ని అవసరమైతే అన్ని మాత్రమే లెక్క కట్టి నివేదిక అందించామని మిగతావ లెక్కకు రావని సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని వాపోయారు. అదేవిధంగా కొందరికి 50 అడుగుల లోతు గల బోరు బావులుంటే 20 లక్షల రూపాయల వరకు

కోర్టుకు వెళ్లారని కక్ష కట్టిన అధికారులు
నిర్వాసితుల ఆవేదన

పరిహారం అందించారని నాలుగు వందల అడుగుల నుండి ఏడు వందల అడుగుల వరకు లోతు బోరు బావులు ఉన్న తమకు కేవలం లక్ష రూపాయల లోపే పరిహారం అందించారన్నారు. ఇంత మోసపూరితమైన పరిహారాన్ని తాము ఐదుగురు రైతులు తీసుకోకపోవడంతో ఈ పరిహారాన్ని తిరుపతి భూసేకరణ కోర్టులో డిపాజిట్ చేసినట్లు అధికారులు తెలియజేస్తున్నారని అన్నారు. తాము అభివద్ధి పనులకు ప్రభుత్వానికి భూమి ఇవ్వడానికే వ్యతిరేకం కాదని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తమకు పరిహారం ప్రకటిస్తే భూములు ప్రభుత్వానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తరతరాలుగా భూమిని నమ్ముకొని బతుకుతున్న తమకు ఈ భూమి పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ పిల్లలు ఉన్నత విద్య అభ్యసించి ఉన్నారని వారికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టబద్ధమైన పరిహారం అందించాలని తాము సంవత్సర కాలంగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు న్యాయం చేయలేదని ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని హెచ్చరించారు. రైతులకు జరిగిన అన్యాయంపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ భూ సేకరణ చట్టం 2013ను అమలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. బ్రాడ్‌లైన్ కోసం తీసుకున్న భూమికి వేరువేరు పంచాయతీల్లో వేరువేరుగా పెద్ద మొత్తం తేడాతో రైతులకు పరిహారం అందించడం బాధాకర విషయమన్నారు. చెట్లు, బోరు బావులు, పైప్ లైన్ విషయంలో కొందరు అధికారులు మామూళ్ల మత్తులో నిజమైన రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అవగాహన ఉన్న కొందరు రైతులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. అయితే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో అధికారులు అలసత్వం వహిస్తూ భూసేకరణలో రైతులకు మోసం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అధికారుల పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం బాధిత రైతులను ఐక్యం చేసి చట్టాన్ని ఉల్లంఘించిన అధికారులపై ఉన్నత న్యాయస్థానంలో ఫిర్యాదు చేస్తామని, అదేవిధంగా బాధిత రైతులతో కలిసి సంబంధిత కార్యాలయాల వద్ద నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. పరిహారం పంపిణీ విషయంపై తహశీల్దార్ మారుతి మాట్లాడుతూ ప్రభుత్వం అభివద్ధి పనుల కోసం ఎవరి భూమినైనా తీసుకుంటుందన్నారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతుల జరిగిన అన్యాయాన్ని పరిశీలించి సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామని రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

అత్యాచారం కేసులో మరో ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లెలో దళిత మైనర్ బాలిక అత్యాచార కేసులో మరో ఏడుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. మంగళవారం ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, సిఐ రెడ్డప్పలతో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను వెల్లడించారు. బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి ఇదివరకే కొంతమందిని అరెస్టు చేశామన్నారు. మంగళవారం మరో ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. మిలిగిన వారిని తొందరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. ఏడు గుర్రాలపల్లికి చెందిన బూడిద రాజేష్, తూము హేమంత్, చిన్న బాసి కార్తీక్, బాసి సోనప్ప, బుడిద రాజేంద్ర, కనగానపల్లి మండలం తల్లిమడుగు గ్రామానికి చెందిన అంకె ముక్తానందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మైనర్‌ను జువైనల్‌హోంకు తరలిస్తామన్నారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయన్నారు. ఏ నేరం జరిగిన దానిని రాజకీయ కోణంలో చూడరాదని సూచించారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోనిపెనుగొండ పావగడ ప్రధాన రహదారిలో పాతర్లపల్లి పెద్ద కోడి పల్లి గ్రామాల మధ్యలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయ్యాయి. మండలంలోని ఆర్. లోచర్ల గ్రామానికి చెందిన వెంకటరమణ, కెనరా బ్యాంకులో క్యాషియర్ గా పనిచేస్తున్న మహిళ ఉద్యోగి గంగ రత్నమ్మ వేర్వేరు ద్విచక్రవాహనాల్లో వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెంకటరమణప్పకు కాలు విరిగింది. గంగరత్నమ్మకు చేయి విరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

ఆరు టన్నుల చీనీకాయలు చోరీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

పక్వానికి వచ్చిన చీనీకాయలను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకెళ్లారనిబాధిత రైతు మంగళవారం బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతు ఎరికల గోపాల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మనకొట్టాల గ్రామానికి చెందిన ఎరికల గోపాలుకు డి. చెర్లోపల్లి సమీపంలోని సర్వే నెంబర్ 488లో పది ఎకరాల భూమి ఉంది.అందులో మూడు ఎకరాలు వరి పంటను సాగు చేయగా, మిగిలిన ఏడు ఎకరాల్లో చీనీ పంట సాగు చేస్తున్నాడు. పది సంవత్సరాలుగా పంటను తీస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా పక్వానికి వచ్చిన కాయలను రెండు రోజుల తరువాత కాయలను కోయాలనుకున్నాడు. అయితే సోమవారం సాయంత్రం పొలంలోకి వెళ్లగా సుమారుగా 150 చెట్లలోని సుమారు ఆరు టన్నుల చీనీకాయలను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకొని వెళ్లినట్లు గుర్తించినట్లు బాధిత రైతు తెలిపాడు. వాటి విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.2.10 లక్షలు ఉంటుందన్నారు. పది రోజుల క్రితం ఈ తోటకు దగ్గరలోని మాలగుండ్లపల్లికి చెందిన ఈశ్వరరెడ్డి తోటలోని చీనీకాయలను గుర్తు తెలియని వ్యక్తులు కోసుకొని వెళ్లారని గ్రామస్తులు తెలిపారు. తమకు జరిగిన అన్యాయంపై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తాడిమర్రి

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా రెండు అభివృద్ధి కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తాడిమర్రి మండల కేంద్రంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్, తహశీల్దార్ కార్యాలయం నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా గ్రామీణ ప్రజలకు సమర్థవంతమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 168 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో భాగంగా ధర్మవరం నియోజకవర్గానికి ప్రత్యేకంగా రెండు యూనిట్లను కేటాయించామన్నారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహశీల్దార్ కార్యాలయం ద్వారా ప్రజల ఫిర్యాదులకు వేగవంతమైన పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, డిఎంహెచ్ఒ ఫైరోజ్ బేగం, ఆర్డీవో మహేష్, తహశీల్దార్ భాస్కర్ రెడ్డి, ఎంపీడీవో రంగారావు, వైద్యాధికారులు, కూటమి నాయకులు తదితరులుపాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి

ప్రజాశక్తి - కదిరి టౌన్

మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామనిఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని నిజాంవలి కాలనీలో ఆంధ్రప్రదేశ్ బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు సమాజంలో గౌరవం లభించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అండర్ - 15 క్రికెట్ జట్టుకు కదిరి క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆంధ్రాక్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ - 15, 19 దక్షిణ మండల అంతర జిల్లాల క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లా అనంతపురం జట్టుకు కదిరి క్రీడాకారులు హుస్నారా, నిశ్చయ్ ఎంపిక అయ్యారు. కోచ్ నజీర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జిల్లా నెల్లూరు లో జరుగుతున్న అండర్ 15 బాలికల క్రికెట్ పోటీలకు హుస్నారా ఎంపికైందన్నారు. కడపలో బుధవారం నుండి ప్రారంభం కానున్న అండర్ 19 పోటీలకు నిశ్చయ్ ఎంపిక అయ్యాడన్నారు. అండర్ - 15 ,19 జట్లకు కదిరి ప్రాంతం నుండి విద్యార్థులు ఎంపికవడం పట్ల ఎమ్మెల్యే, కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షులు కందికుంట వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, సాధన, బ్లూ మూన్ పాఠశాల యాజమాన్యం హర్ష వ్యక్తం చేశారు.

వితంతు పింఛన్ల పంపిణీకి చర్యలు
కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 12, 13 తేదీలలో పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది, 2023 నుంచి 2024 వరకు కుటుంబ యజమాని పెన్షన్ పొందుతూ మరణించిన వారికి అదే స్థానంలో పింఛను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 3035 దరఖాస్తులు రాగా వాటిని ప్రభుత్వం ఆమోదించిందన్నారు. వీటిని గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు పంపిణీ చేస్తారన్నారు.

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
O.S. No:426/2022
Between:
రెడ్డిపల్లి నరసింహారెడ్డి మరియు ఇతరులు ...వాదులు
మరియు
పలకా నరసింహులు మరియు ఇతరులు ...ప్రతివాదులు
To
D7:సిద్దే కిషోర్ కుమార్ S/o లక్ష్మినారాయణ, డోర్ నెం.1-303, వానవోలు, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
7వ ప్రతివాదికి దావా సమను
పై దావాలో పై కోర్టువారు మీ హాజరు నిమిత్తము 02/07/2025వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షములో పై దావాను మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:02/07/2025
స్థలం : కదిరి
ఎ.పి.సిద్ధార్థ సాయికుమార్ రెడ్డి, BA, LLB,
కె.నరేంద్ర, BBA, LLB,
వాదితరుపు వకీళ్ళు, కదిరి

మహారాజశ్రీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు,కదిరి.
I.A. No:199/2022 in O.S. No:426/2022
Between:
రెడ్డిపల్లి నరసింహారెడ్డి మరియు ఇతరులు
...పిటీషనర్స్-వాదులు
మరియు
పలకా నరసింహులు మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్-ప్రతివాదులు
To
R7:సిద్దే కిషోర్ కుమార్ S/o లక్ష్మినారాయణ, డోర్ నెం.1-303, వానవోలు, గోరంట్ల మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.
7వ రెస్పాండెంట్‌కు నోటీసు
పై అర్జీలో పై కోర్టువారు మీ హాజరు నిమిత్తము 02/07/2025వ తేదికి వాయిదా వేసినారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10:30 గం॥లకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టువారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షములో పై అర్జీని మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:02/07/2025
స్థలం : కదిరి
ఎ.పి.సిద్ధార్థ సాయికుమార్ రెడ్డి, BA, LLB,
కె.నరేంద్ర, BBA, LLB,
పిటీషనర్స్ తరుపు వకీళ్ళు, కదిరి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No:69/2019
Between:
మండోజ్ మహమ్మద్ అలీఖాన్ మరియు ఇతరులు
... పిటిషనర్స్/వాదులు
మరియు
షేక్ ఖాతుమ్‌భీ మరియు ఇతరులు ...ప్రతివాదులు
1వ ప్రతివాదికి దావా నోటీసు
To,
షేక్ ఖాతుమ్‌భీ W/o షేక్ మైనోద్దీన్ సాబ్, డోర్ నెం.15-180, మెయిన్ రోడ్డు కుటాగుళ్ళ (గ్రామం) పోస్టు, కదిరి మున్సిపాలిటీ, కదిరి మండలం శ్రీ సత్యసాయి జిల్లా.
అను మీపైన మండోజ్ మహమ్మద్ అలీఖాన్ మరియు ఇతరులు పైన తెలిపిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివార కోర్టులో అగ్రిమెంట్ దావా వేసినారు. సదరు దావా మీ హాజరు నిమిత్తం పై వారి కోర్టు నందు 04-09-2025 తేదిన వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదిన మీరు స్వయంగా కాని, వకీలు ద్వారా గాని పైవారి కోర్టు నందు ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అక్షేపణలు తెలుపు కొనవచ్చును.అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షంలో తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:04-09-2025
స్థలం:కదిరి
ఇట్లు
వి.ప్రసాద్ రెడ్డి,
వాదిపరం వకీలు, కదిరి.
సెల్:9440201406

కొనసాగుతున్న 'ప్రయివేటు' ముందస్తు అడ్మిషన్లు

చైతన్య పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో ప్రయివేటు పాఠశాలల ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రయివేటు పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కదిరి పట్టణంలోని ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో వివిధ పేర్లతో ముందస్తు అడ్మిషన్లు, ఫీజులు దోపిడీ యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రయివేటు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లపై ఈనెల 9న ప్రజాశక్తి లో కథనం ప్రచురితమైంది. అయినా విద్యాశాఖ అధికారులలో ఎటువంటి చలనం లేకపోగా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వాల్మీకి పాఠశాలలో యాదేచ్ఛగా అడ్మిషన్లు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. దీంతో ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియ, ఫీజుల దోపిడీని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని శ్రీ చైతన్య విద్యాసంస్థల ముందు ఎస్ఎఫ్ఐ ఎఐఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థిసంఘం నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ అధికారుల మొద్దు నిద్రలో ఉన్నారని విమర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ శ్రీ సత్య సాయి జిల్లా జిల్లా కార్యదర్శులు నామాల నాగార్జున, మహేంద్ర బాబ్జాన్ మాట్లాడుతూ చదువుల పేరుతో విద్యాసంస్థలను వ్యాపార సంస్థలుగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు జిల్లా అధికారులకు, మండల విద్యాశాఖ అధికారికి విన్నవించినా పట్టించుకోవటం లేదని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు, ఫీజుల దోపిడీ కొనసాగిస్తున్నారని విమర్శించారు. వీటిని అడ్డుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో శ్రీ చైతన్య విద్యాసంస్థలకు సిబిఎస్ఇ అనుమతులు లేకపోయినా, సీబీఎస్ఈ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టించి లక్షల రూపాయలు ఫీజులు వసూలుకు పాల్పడుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖ చట్టం నిబంధనల మేరకు విద్యాసంస్థలలో పుస్తకాలు విక్రయించకూడదన్న నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. ఆన్లైన్ ద్వారా విద్యార్థుల ఇంటికి శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యాల పుస్తకాలను పంపుతున్నారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ప్రీ ప్రైమరీ కి అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు, విద్య మాఫియాపై విద్యాశాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదన్నారు. విద్యాసంస్థల అడ్మిషన్లు ఫీజుల దోపిడీ పుస్తకాల విక్రయం వంటి వాటికి అడ్డుకట్ట వేయడం కోసం జిల్లా విద్యాశాఖ అధికారి నెలరోజుల క్రితం నియమించిన త్రిసభ్య కమిటీ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు గణేష్, అఖిల్, మహేష్ నాయక్, సాయికుమార్ , ఏ గణేష్ గంగాద్రి, జగన్మోహన్, పవన్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పట్టించుకోని అధికారులు
విద్యార్థిసంఘాల నాయకుల ఆగ్రహం

కేసు నమోదు: కదిరి పట్టణంలోనీ శ్రీ చైతన్య స్కూల్ లో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు అక్రమంగా పాఠశాలలోకి ప్రవేశించి స్కూల్లో ఉన్న ఫర్నిచర్ ఇతర సామాగ్రిని ధ్వంసం చేసి బెదిరించారని సిబ్బంది ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. కదిరిలోని మదనపల్లి రోడ్డు పక్కన ఉన్న శ్రీ చైతన్య స్కూల్ వద్దకు మంగళవారం 12.30 సమయంలో ఎటువంటి పర్మిషన్ లేకుండా స్కూల్లో ఓపెన్ చేసి బుక్కులు యూనిఫాంలో అమ్ముతున్నారని, కదిరి టౌన్ కు చెందిన పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ లీడర్ మహేంద్ర, ఎస్ఎఫ్ఐ బాబ్జాన్, ఎం ఎస్ ఎఫ్ సాకే హరి, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ గణేష్, ఎమ్మెస్ ఎఫ్ సోము, ఎమ్మెస్ ఎఫ్ రాజు పాఠశాలలోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారని, సిబ్బందిని బెదిరించారని ఫిర్యాదు అందిందని చెప్పారు. ఈ మేరకు విద్యార్థిసంఘాల నాయకులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

పనితీరు మార్చుకోవాలి : ఎమ్మెల్యే

కౌన్సిల్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని లేని పక్షంలో చర్యలు తప్పవని శాసనసభ్యులు పల్లె సింధూర హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు రత్నప్ప చౌదరి, చెరువు భాస్కర్ రెడ్డి, నాగమణి, పల్ల వెంకట రమణమ్మ తదితరులు మాట్లాడుతూ అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇస్తా రాజ్యాంగ అజెండా పెట్టడం బిల్లును పాస్ చేయించుకోవడం జరుగుతోందన్నారు. తాము సొంత నిధులు వెచ్చించి పనులు చేసినప్పటికీ తమకు మాత్రం బిల్లును మంజూరు కావడం లేదన్నారు. పారిశుధ్యం, వీధిలైట్లు, తాగు నీటి సమస్యలు ఉన్నాయన్నారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడతూ గత రెండు సమావేశాల్లో కూడా ఇవే సమస్యలు చెప్పారని, సంబంధిత సిబ్బంది ఏమి చేస్తున్నారనిఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఈ స్వాతి, సారిటరీ ఇన్స్పెక్టర్ శివయ్య తమ పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. రూ.12 కోట్లు మున్సిపాలిటీలో బకాయిలు ఉన్నాయని ఎందుకు వసూలు చేయడం లేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కౌన్సిలర్ సూర్య గౌడ్ మాట్లాడుతూ 15 ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.2.35 కోట్లు మంజూరు అయితే వాటిని వినియోగించకపోవటంతో ఆ నిధులు వెనక్కు వెళ్లాయన్నారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్యలు పట్టిపీడిస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై ప్రతి విషయం కౌన్సిలర్లకు ముందుగానే తెలపాలని వచ్చే సమావేశం నాటికి ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కమిషనర్ క్రాంతికుమార్‌ను సిబ్బందిని ఆదేశించారు. పడమటి గేటు రహదారి గుంతల మయంగా ఉందని, అలాగే చిత్రావతి నది సుందరీకరణ పనులు చేపట్టాలని అన్నారు. జాయ్ కంపెనీ పుట్టపర్తి అభివద్ధికి కోటి రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారులు కౌన్సిలర్లు అందరూ కలిసి గ్రీన్ అండ్ క్లీన్ పుట్టపర్తిగా మారుద్దామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఆర్ ఐ నరసింహులు, మెప్మా అధికారి రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు మహిళల నిరసన

పెనుకొండలో మహిళల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-పెనుకొండ

తల్లి,చెల్లి విలువ తెలియని జగన్.. తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడంటూ మహిళలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మూడు రోజుల క్రితం సాక్షి మీడియాలో అమరావతి రాజధాని మహిళలపై చేసిన అసభ్యకర వాఖ్యలకు నిరసనగా మహిళలు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి తెలుగు తల్లి సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సాక్షి ఛానల్, సాక్షి పత్రిక ను తక్షణమే మూసివేయాలంటూ నినాదాలు చేశారు. ఏవో గిరి కి వినతి పత్రం అందజేశారు . అనంతరం సాక్షి దినపత్రికలను దహనం చేశారు. రాజధాని అమరావతి పై చౌకబారు విమర్శలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు రమణమ్మ, చంద్రకాంతమ్మ, అనసూయమ్మ, బేబీ, నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : అమరావతి మహిళలపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ధర్మవరం పట్టణంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహిళలను కించపరిచిన కొమ్మినేని శ్రీనివాసరావు, కష్ణంరాజు దిష్టిబొమ్మను, సాక్షి దినపత్రికలను కళాజ్యోతి సర్కిల్లో పెట్రోలు పోసి దహనం చేశారు.

మడకశిర : మహిళలను అవమానించిన వారు కాలగర్భంలో కలిసిపోవడం ఖాయమని టిడిపి నాయకులు, మహిళలు తీవ్ర స్థాయిలో ధ్వజంమెత్తి నిరసన తెలిపారు. పట్టణంలో అమరపురం రోడ్డులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రాధమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణంలో నిరసనలు వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళల్ని అవమానపరుస్తూ క్షమించరాని నేరానికి పాల్పడిన జగన్ రెడ్డి ' ఆయన సతీమణి భారతి బేషరతుగా మహిళా లోకానికి క్షమాపణ కోరాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర, సుజాత రమేష్ , ఉమాశంకర్ , శ్రీనివాసులు , ప్రభావతి, హనుమంతు, తెలుగు యువత నాయకుడు తిమ్మరాజు , మెప్మా సంఘం.సభ్యురాలు ఆర్పీలు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెరిగిన అరాచకాలు

అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతులు, మహిళలకు రక్షణ కరువైందని హిందూపురం, మడకశిర నియోజకవర్గాల వైకాపా సమన్వయకర్తలు దీపికా వేణురెడ్డి, ఈరలక్కప్ప విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా ఆగని మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాల పై నిరసనగా స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఎన్నికలలో ఈ కూటమి ప్రభుత్వం గెలిచిన దగ్గర నుంచి ఈ రాష్ట్రం రావణ కాష్టంగా తయారైందని విమర్శించారు. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ శాంతి భద్రతలను తమ చేతిలోకి తీసుకొని తమకు నచ్చని వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ అడ్డు వచ్చిన వారిపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ కొత్తగా రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో మహిళలు, బాలికలకు భద్రత కరువైందని ఆరోపించారు. ఆడబిడ్డల మాన ప్రాణాలకు రక్షణ లేదన్నారు. మహిళలకు అడుగడుగునా అన్యాయం జరుగుతుందన్నారు. మహిళలకు భద్రత కల్పించడంలో పూర్తి వైఫల్యం చెందిన హోం మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి, రాష్ట్ర కురుబ సంఘం వర్కిర్ ప్రెసిడెంట్ శివ, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కవిత రెడ్డి తదితర మహిళలు, ప్రజాప్రతినిధులు, రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అనుబంధ విభాగ నాయకులు, మండల కన్వీనర్లు, నియోజకవర్గ స్థాయి అనుబంధ విభాగం నాయకులు, సీనియర్ నాయకులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ విధానాలపై వైసిపి నిరసన

అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -అగళి

మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జాఫర్ తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 20వ తేదీ తుది గడువు అని చెప్పారు. మోడల్ స్కూల్లో ఈనెల 24వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించ బడుతుందన్నారు. ఇంటర్మీడియట్లో ప్రవేశానికి 10వ తరగతిలో వచ్చిన మార్కులు ఆధారంగా అడ్మిషన్ ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

12న విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - అగళి

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటై సంవత్సర కాలం అయిన సందర్భంగా ఈనెల 12వ తేదీన మడకశిర నియోజకవర్గం కేంద్రంలో నిర్వహించే ౦ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని జెడ్పిటిసి ఉమేష్, టిడిపి మండల కన్వీనర్ కుమార్ స్వామి తెలిపారు. శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరిగే ఈ విజయోత్సవ ర్యాలీ కి అగళి మండలం నుంచి కార్యకర్తలు నాయకులు సర్పంచులు ఎంపిటిసిలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుడిబండ : ఈనెల 12వ తేదీ మడకశిర పట్టణంలో నిర్వహించే కూటమి ప్రభుత్వం ప్రథమ వార్షికోత్సవ ర్యాలీని విజయవంతం చేయాల్సిందిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి,మండలకన్వీనర్ మద్దనకుంటప్ప కోరారు.వారు ఈసందర్భంగా మాట్లాడుతూ గురువారం ఉదయం 10 గంటలకు మడకశిర పట్టణంలోని అన్నా క్యాంటీన్ నుండి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వరకు నిర్వహించే కూటమి ప్రభుత్వ మొదటి వార్షికోత్సవ ర్యాలీలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నట్లు వారు తెలిపారు.కావున ఈ కార్యక్రమానికి మండలంలోని టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై విజయ వంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గుడిబండ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దనకుంటప్ప జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, క్లస్టర్ ఇంచార్జ్ లక్ష్మీనరసప్ప, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు తగదు : టిడిపి

ప్రజాశక్తి - గుడిబండ

ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై వైసిపి నియోజకవర్గ ఇన్ఛార్జి ఈరలకప్ప చేస్తున్న ఆరోపణలు తగదని టిడిపి స్థానిక నాయకులు హెచ్చరించారు. టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, క్లస్టర్ ఇన్ఛార్జులు లక్ష్మీనరసప్ప భీమరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తమ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఈరలకప్పకు పుట్టగతులుండవన్నారు. ఈరలకప్ప చేసిన అక్రమాలు ఎవరికి తెలియవని అన్నారు. సర్పంచిగా ఉన్నప్పుడు చేసిన పనులపై విమర్శించారు. ఎమ్మెల్యే రాజుకుపై ఉన్న కేసులన్నీ ఆయన ప్రజల కోసం చేసిన ఉద్యమాల సమయంలోనే అని గుర్తు చేశారు. ఎవరో చెబితేనో ఎవరో బలవంతం పెడితేనో నోటికొచ్చినట్లు మాట్లాడితే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావని వారు హెచ్చరించారు.

వ్యాపారులతో విద్యాశాఖ కుమ్మక్కు..!

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున

ప్రజాశక్తి-హిందూపురం

విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నూతన అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తున్నా పరిశీలన చేయాల్సిన విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు మొద్దు నిద్ర పోతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగర్జున విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యా ప్రమాణాలు పాటించకుండా సంపాదనే లక్ష్యంగా విద్యా వ్యాపారానికి పాల్పడుతూ, పేద వర్గాల నుండి అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులను గుంజుతూ పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఏ ఒక్క ప్రైవేట్ విద్యాసంస్థపై అధికారులు చర్యలు తీసుకునే సాహసం చేయలేకపోతున్నారని దీని అంతర్యం ఏమిటో విద్యాశాఖ అధికారులే చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హతలు లేని ఉపాధ్యాయులను తక్కువ జీతభత్యాలకు నియమించుకోవటం, కనీస సౌకర్యాలు పాటించకపోవటం, ప్రభుత్వ నిబంధనలు పాటించకపోవటం లాంటి అసౌకర్యాలను విద్యార్థులకు కల్పించి లక్షల రూపాయలు డిమాండ్ చేసినా విద్యాశాఖ అధికారులు నోరు మెదపకుండా ఉన్నారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకోని ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకొని తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేట్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మడకశిర

కౌన్సిల్మీట్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మంగళవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 4 సంవత్సర మున్సిపల్ కౌన్సిల్ పనితీరుకు నూతనంగా ఏర్పడిన మున్సిపల్ కౌన్సిల్ పనితీరుకు మార్పు కనిపించే విధంగా పనిచేయాలన్నారు. నాలుగు సంవత్సరాలలో లక్ష రూపాయల లోపు బిల్లులకు డబ్బులు డ్రా చేయడంతో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని కౌన్సిల్లో తీర్మానం చేశారు. మున్సిపాలిటీలో జరుగు పనులకు టెండర్ల ద్వారానే పనులు నిర్వహించాలని టెండర్లు పిలవకుండా ఏ ఒక్క పనులు కూడా చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఛైర్పర్సన్ వెంకట లక్ష్మమ్మ, కౌన్సిలర్లు రాజా, ఉమాశంకర్, శ్రీనివాసులు, ఓబులమ్మ శ్రీనివాస్, ప్రభావతి హనుమంతు, ప్రియాంక ఈశ్వర్, సుభద్ర నాగేంద్ర, పార్వతమ్మ దాసప్ప, సావిత్రమ్మ బలరాం, సుధాకర్ నాయక్, సుజాత రమేష్, కమిషనర్ రంగస్వామి, మున్సిపల్ సిబ్బంది,పాల్గొన్నారు,

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2025 .26 సంవత్సరానికి గాను పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ పొందుటకు జూన్ 12వ తేదీ నుండి జులై 30వ తేదీ వరకు ఆన్లైన్లో సబ్మిట్ చేయాలని.డీఈవో క్రిష్టప్ప, తెలిపారు. పదవ తరగతిలో చేరుటకు 14 సంవత్సరాలు నిండిన వారికి, ఇంటర్మీడియట్ చేరుటకు పదవ తరగతి పాసైన వారు 15 సంవత్సరాలు వయస్సు పూర్తి అయి ఉండాలన్నారు. ఈ దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా చేసుకోవాలని జిల్లా వత్తి విద్యల అధికారి లాజర్ చెప్పారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని ఐసిడిఎస్ సూపర్వైజర్ దేవమణి తెలిపారు. కిషోరి వికాసం ముగింపు కార్యక్రమం బత్తలపల్లి మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ దేవమణి మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు ఈ కిషోర్ వికాసం సమ్మర్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, పిల్లల హక్కులు, ప్రస్తుతం చిన్నారులపై జరుగుతున్న దాడుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ ఆనంద్, ఏఎన్ఎం, వివో లీడర్స్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పొగాకు వాడకానికి దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రజలు పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని దూరంగా ఉండాలనిమెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మవరం కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీసీపి, సామాజిక కార్యకర్త శమంతకమణి, ఎంపిహెచ్ఎ మోహన్ కుమార్, సిఒ మారుతికుమార్, ఫార్మసిస్ట్ .శ్రీనివాస్ రెడ్డి, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు. ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని ఆర్. మరవపల్లిలో పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో రైస్ మిల్ సమీపంలో తాగునీటి పైపులైను పగిలిపోయి నీరు వృథా అవుతోంది. 10రోజులుగా నెలకొన్న ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పైపులైను మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరారు.

13న మండల మీట్

ప్రజాశక్తి - గాండ్లపెంట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13న ఎంపీపీ జి సోమశేఖర్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి జడ్పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల కో ఆప్షన్ సభ్యులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని ఎంపిడిఒ కోరారు.

ఎమ్మెల్యే 'కందికుంట'కు సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందని హర్ష వ్యక్తం చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ను ఆసంఘం నాయకులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా కదిరి మున్సిపాలిటీలోని నాలుగు యుపి స్కూళ్లను హైస్కూలుగా అప్గ్రేడ్గా మార్చడంతో ఆ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయుల పోస్టులతో పాటు వివిధ సబ్జెక్టుల పోస్టుల మంజూరుకు అవకాశం లభించిందన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు రావడం హర్షణీయమని అన్నారు. అనంతరం ఆ స్కూల్ల అప్గ్రేడ్కు సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ని మున్సిపల్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.. ఈ కార్యక్రమంలో కదిరి మండల విద్యాశాఖ అధికారులు చిన్నకృష్ణ , ఓబుల్ రెడ్డి ప్రధానోపాధ్యాయులు నాగరాజు వరప్రసాద్ రాజు,వెంకటరమణారెడ్డి రామకష్ణారెడ్డి మున్సిపల్ ఉపాధ్యాయులు మధుసూదన్, భార్గవ్, మైనుద్దీన్ ,రెడ్డి రాజేష్, జనార్దన్, సోమశేఖర్, మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు డి శ్రీనివాసులు ,మల్లికార్జున, బ్రహ్మేంద్ర, సంతోష్ కుమార్, రమణా నాయక్ తదితరులు పాల్గొన్నారు

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు

పంటల సాగులో రైతులు తగిన మెలకువలు పాటించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ యుగంధర్, శిరీష ,హరిణి తెలిపారు. మండల పరిధిలోని బైరాపురం, మీర్జాపురం, కోడపగాని పల్లి, గ్రామాలలో వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమం సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధిక మోతాదులో ఉపయోగించే ఎరువులు పురుగుల మందులకు స్వస్తి చెప్పి వైవిధ్యతను ప్రోత్సహించాలన్నారు. పంట సాగులో వాతావరణ పరిస్థితులను బట్టి అనువైన పంటలను సాగు చేయాలన్నారు. అధిక దిగుబడులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం భూసార పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నటరాజు, సిబ్బంది నవీన్ ,ప్రతాపరెడ్డి ,అశ్విని, కౌశిక్, సర్పంచులు రవికుమార్, అలివేలమ్మ రైతులు పాల్గొన్నారు.

ఎస్పి.బాలసుబ్రమణ్యం జయంతి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని నానెప్ప నగర్ కెవిఆర్ ఫంక్షన్ హాల్ లో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలు, సంగీత విభావరి కార్యక్రమాలు మంగళవారం ఘనంగా జరిగాయి. మంచు మ్యూజిక్ మెలోడీస్ ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు గాజుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకలలో మునిసిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, డిఎస్పీ మహేష్, సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, రాజ్యలక్ష్మి నాగరత్నమోహన్, మార్గదర్శి మాళప్ప హాజరై జ్యోతి ప్రజ్వలన గావించి బాలు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కుమార్, ఉమర్ ఫరూక్, ఎంఈఓ.గంగప్ప, కళాకారుల ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు అంజప్ప, ఆర్బీ చలపతి, కేఠే శ్రీధర్, సంగీత కళాకారులు భారతి, గిరిజా, మల్లేష్, నారాయణ, సంగీత కళాకారులు, సంగీత అభిమానులు, కళాపోషకులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే నివాసంలో కేక్కట్ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలో టిడిపి నాయకులు, బాలయ్య అభిమానుల ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలయ్య నివాసం వద్ద టిడిపి నాయకులు కార్యకర్తలు సమక్షంలో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, బాలయ్య పీఏలు వీరయ్య, బాలాజీ, సీనియర్ నాయకులు నాగరాజులు కేక్ కట్ చేశారు, అనంతరం అక్కడే టిడిపి నాయకుల సౌజన్యంతో రక్త దాన శిబిరం, ఆరోగ్య శిబిరం, పేదలకు అన్నదానం, పాలు బెడ్డు, ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవినహళ్లి ఆనంద్ కుమార్ సౌజన్యంతో 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మున్సిపల్ చైర్మన్ డి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలో చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించారు. సాయిత్రం పద్మశ్రీ ఘంటసాల కళామందిర్ కమిటీ ఆధ్వర్యంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాదులో జరిగిన బాలయ్య జన్మదిన వేడుకల్లో పురం ఎన్బికె జాతీయ అధ్యక్షులు సంబారి సతీష్ ఆధ్వర్యంలో అభిమానులు పాల్గొని జ్ఞాపికను అందించారు. అదే విధంగా వివిధ వార్డుల్లో వార్డు కౌన్సిలర్లు జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. మైనార్టీ నాయకులు అబుబకర్, కౌన్సిలర్ రాఘవేంద్రల ఆధ్వర్యంలో సాయి సదన్ విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, బాలయ్య అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.